క్లుప్తంగా

మామిడి దిగుబడి అంచనాలు సిద్ధం చేయాలి


ఆర్ఎస్కే సిబ్బందితో సమీక్షిస్తున్న హెచ్ఓ సాగరిక

బంగారుపాళెం: మండలంలో మామిడి దిగుబడిపై అంచనాలు సిద్ధం చేయాలని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మండలకేంద్రంలో బుధవారం రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల్లో 2025వ సంవత్సరానికి సంబంధించి రైతుల తోటల్లో పండిన మామిడి పంట దిగుబడి అంచనా సిద్ధం చేయాలని సూచించారు. తోటల్లో ఏఏ రకం మామిడి దిగుబడి వచ్చింది. ఎన్ని టన్నులు వచ్చింది. అందులో బెంగళూరు రకం మామిడి ఎన్ని టన్నులు వస్తుందనే అంచనాలను తయారు చేసి అందించాలన్నారు. ఈ సీజన్‌లో బెంగళూరు రకం మామిడి ఫ్యాక్టరీలకు ఏమేరకు సరఫరా చేయవచ్చు అని తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అందుకు తగ్గట్టుగా రైతులు పంట కోత చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం విద్యార్థులకు సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలను, దేశ నాయకుల చరిత్రలను చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, కంప్యూటర్ తదితర అంశాల్లో గ్రంథాలయాధికారి సుజాత శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు, వారిలో నైపుణ్యాలను పదును పెట్టేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలిగా మాధవి




ఐరాల: మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలిగా మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో అధ్యక్షురాలుగా మాధవి, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌ను ఎన్నుకున్నారు. మాధవి మాట్లాడుతూ మండల రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

గుడిపాల: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పూజిత తెలిపారు. పేయనపల్లెలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫిలస్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇది మంచినీటిలో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాపింపజేస్తుందన్నారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెజ్వాన, సుధ, శివగామి, శశి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో చర్చిల ప్రారంభానికి కృషి


చర్చి ప్రారంభోత్సవంలో బిషప్

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్ఐ చర్చిలు ప్రారంభించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వేలూరు సీఎస్ఐ డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ శర్మ నిత్యానందన్ అన్నారు. మండలంలోని కాశిరాల పంచాయతీ పరిధిలోని గాంధీపురంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ గుడ్ షెఫర్డ్ చర్చిని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన చర్చి పాస్టర్లు, కార్యదర్శులు కోశాధికారులు, గ్రామ పెద్దలు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ఈ-ఆటోలు



ప్రజాధనం.. నిరుపయోగం!

గుడిపాల: ప్రజా అవసరాల కోసం కొనుగోలు చేసిన వాహన, యంత్ర సామగ్రి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. సక్రమంగా వినియోగించాల్సిన వీటిని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చెత్తసేకరణ కోసం వినియోగిస్తున్న ఈ–స్కూటర్లు, ఈ- ఆటోలు, వాటర్ ఫిల్టర్‌కు సంబంధించిన పరికరాలు ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోతున్నాయి. లక్షలాది రూపాయల నిధులతో కొనుగోలు చేసిన వీటిని ఎందుకు నిరుపయోగంగా పడవేశారో తెలియని పరిస్థితి. చిన్న చిన్న మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచన కూడా ఎవరూ చేయడం లేదు. ఒకవేళ ప్రజా అవసరాలకు వద్దనుకుంటే వేలం నిర్వహిస్తే కనీసం ప్రభుత్వానికి ఆదాయమైనా సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


తుప్పపట్టి పోతున్న ఈ- స్కూటర్లు
ఇన్‌సెట్‌లో పనిచేయని వాటర్ ఫిల్టర్

బోయకొండ గంగమ్మ నిమజ్జనోత్సవం

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా సాగింది. జాతర కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం అమ్మవారికి ఉదయం అభిషేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో కనువిందుగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అమ్మవారి సన్నిధి నుంచి బొమ్మాయిపల్లె, కురప్పల్లె, తిమ్మోజిపల్లె, మాదవనగర్, బంగారుపాళెం, తగ్గువారిపల్లె, కరిడివారిపల్లె, రామానాయుడుపాళెం మీదుగా మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అమ్మవారి జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉభయదారులకు, పరిసర గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


అమ్మవారి గ్రామోత్సవం

ఘనంగా గంగమ్మ నిమజ్జనం

మండల కేంద్రంలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి సింహవాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం పురవీధుల్లో బాణసంచా వేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని పలువురు దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని జలధికి తరలించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా నిమజ్జనం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం గంగమ్మ నిమజ్జనం వేడుకగా సాగింది. ఇరువారం, మూడవగేటు, మురుగానంపల్లి తదితర ప్రాంతాల్లో విశేష పూజలు చేసి అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. అమ్మవారు ఇంటింటా పూజలు అందుకున్నారు. భక్తులు కర్పూర హారుతులు పట్టి మొక్కులు చెల్లించారు. ఈ ఊరేగింపు డప్పు వాయిద్యాల నడుమ సాగింది. పూతలపట్టులో జలధి పూజలు చేసి అమ్మవారిని గంగ ఒడికి చేర్చారు. ఈకార్యక్రమంలో వంశపారంపర్యధర్మకర్త జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే


విశేషాలంకారంలో అమ్మవారు

గుడిపాల: మండలంలో కట్టకిందపల్లెలో జరిగిన గంగమ్మ జాతరలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. గంగమ్మ గుడిలో ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


పూతలపట్టులో పూజలు చేస్తున్న ధర్మకర్త


గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గురజాల

ముగిసిన మహాభారత యజ్ఞం

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలో బుధవారం నిర్వహించిన దుర్యోధనవధ ఘట్టంలో మహాభారత యజ్ఞం ముగిసింది. ఈ నెల 4వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం దిగ్విజయంగా నిర్వహించారు. 4వ తేదీ నుంచి 21వ తేదీ వరకు భాగవతార్ శివకుమారిచే హరికథాగానం చేశారు. 10వ తేదీ నుంచి శ్రీ వెంకటేశ్వర నాట్య కళా మండలిచే రాత్రి నాటకాన్ని కళాకారులచే రక్తికట్టించే విధంగా అద్భుత ప్రదర్శన చేశారు. అనంతరం దుర్యోధనవధ అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ద్రౌపదీ సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మట్టితో దుర్యోధనుడి బొమ్మను అందంగా తీర్చిదిద్దారు. దుర్యోధనుడి వేషధారణలో రమేష్, రామకృష్ణ భీముడి వేషధారణలో రక్తికట్టించారు. మడుగులో దాగిన దుర్యోధనుడిని బయటకు లాక్కొని వచ్చి వధించే ఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి పరిసర గ్రామాలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.


నారసింహనపల్లెలో వైభవంగా ధర్మరాజు పట్టాభిషేకం


నారసింహనపల్లెలో అట్టహాసంగా దుర్యోధన వధ ఘట్టం

జీఓ-4 నుంచి వీఆర్‌ఓలను మినహాయించాలి

తవణంపల్లె: జీఓ నంబరు-4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులకు గురిచేస్తుందని వీఆర్‌ఓల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సుధాకర్‌కు బుధవారం వీఆర్‌ఓలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వీఆర్‌ఓలు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్లస్టర్ విధానంతో వీఆర్‌ఓలను మిగులు సిబ్బందిగా చూపించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలనుకోవడం దారుణమన్నారు. జీఓ నంబరు 4 నుంచి వీఆర్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణం వీఆర్‌ఓల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు చంద్ర, సురేష్, ప్రకాష్, కృపానందం, ప్రకాశం తదితరులు వినతిపత్రం అందజేశారు.


తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

కాపుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం

నగరి : కాపుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని దానికి మనం ఏకతాటిపై నడచి ఐకమత్యంతో పని చేయాలని జాతీయ బలిజ సేవా సంఘం ప్రచార కార్యదర్శి గోపిరాయల్ స్పష్టం చేశారు. స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు ఎంవి బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కాపు సంఘ సమావేశం నిర్వహించారు. కాపుల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గోపిరాయల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాపుసంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల పూజలు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో గురువారం సాయిబాబా మందిరంలో మండల పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామచంద్రారెడ్డి తెలిపారు. జగనన్న కాలనీలో నూతన షిరిడీ సాయిబాబా మందిరం నిర్మించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఉదయం గణపతిపూజ, హోమం, సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సాయినాథుని గ్రామోత్సవం ఉంటుందన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నల్లపురెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తవణంపల్లె: మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పాలసముద్రం : ప్రస్తుతం మనుషుల జీవన శైలి మారిందని, ఆహార అలవాట్లు మారాయని.. మనం తీసుకునే ఆహారం అంతా రసాయన ఎరువులు, పురుగు మందులతో సాగు చేయడంతో వ్యాధులు కారకంగా మారుతోందని.. ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయసాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎంఎంటీ గంగరత్న, డీఎంఎంటీ ధనలక్ష్మి తెలిపారు. బుధవారం వారు శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ సమీపంలో ప్రకృతి వ్యవసాయసాగులో భాగంగా (ఏటీఎం) వెజిటబుల్ మోడల్ సాగుపై ఎంటీ ప్రతాప్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఏఎంఎంటీ గంగరత్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం లక్ష్యం క్రమేపీ రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలన్నారు. ఘన, ద్రవ, కషాయాల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న మహిళలు పుష్ప, నిర్మల, మునియమ్మ పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు